మార్కెట్లకు శ్రావణ శోభ

- నేడు వరలక్ష్మీదేవి వ్రతం
- కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట
- పూలు, పూజా సామగ్రి ధరలకు రెక్కలు



కొనుగోలుదారులతో రద్దీగా మారిన తుని మెయిన్‌రోడ్డు



ఏలేశ్వరంలో పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం/తుని రూరల్‌: మార్కెట్లకు శ్రావణ శోభ నెలకొంది. శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని పురస్కరించుకుని పూజా సామగ్రి కొనుగోలుకు భక్తులు మార్కెట్లకు పోటెత్తారు. గ్రామాలు, పట్టణాల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. మండలంలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని పల్లపు వీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, తోట వీధి, ఆర్టీసీ డిపో, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం, నర్సీపట్నం రోడ్డులోని దుర్గాదేవి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల్లో మహిళలు లలిత సహ్రసపారాయణ, విష్ణుసహస్ర, గోవిందనామాలు పఠించనున్నారు.

పెరిగిన ధరలు

వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటాయి. అమ్మవారికి పెట్టే బంగారురూపులు ధరలు విపరీతంగా పెరిగాయి. గ్రాము బంగారం ధర రూ.10,300 ఉండగా గ్రాము రూపు రూ.10500లకు విక్రయిస్తున్నారు. అమ్మవారికి బంగారురూపు పెట్టడం అనవాయితీ కావడంతో భక్తులు భారమైనప్పటికీ కొనుగోలు చేశారు. పూజకు వినియోగించే యాపిల్, బత్తాయి, దానిమ్మ, జామ, ద్రాక్ష పండ్లు, కలువపువ్వులు, పత్రిలను కొనుగోలు చేశారు. చామంతిపూలు ధరలు విపరీతంగా పెరిగాయి. నాలుగు పువ్వులను రూ.15లకు విక్రయించారు. గురువారం సంతరోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఏలేశ్వరం తరలివచ్చారు. జ్యూయలరీ షాపులు మహిళలతో కిటకిటలాడాయి. కాగా స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అన్నిరకాల పండ్లతో పాటు పత్రిలను విక్రయించారు.

కిటికిటలాడిన తుని మార్కెట్

శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో తుని మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కొనుగోలుదారులు అధికంగా రావడంతో బుధ, గురువారాలు బంగారు, పండ్లు, పూల దుకాణాల్లో రద్దీ నెలకొంది. భక్తులు లక్ష్మీదేవి రూపులు కోసం బంగారం షాపులకు పోటెత్తారు. పూజకు అవసరమైన పండ్లు, పూలు, పత్రి మార్కెట్‌లో కొనుగోలు చేశారు. పూలకు డిమాండ్ ఏర్పడడంతో కిలో బంతిపూలు రూ.200, చామంతి పూలు రూ.600, ఇతర పూలు మూర రూ.60 నుంచి రూ.వంద చొప్పున వ్యాపారులు విక్రయించారు. ఒక్కొక్క కొబ్బరికాయ రూ.40 నుంచి రూ.50, అరటి పండ్ల అత్తలం రూ.50 నుంచి రూ.70కి కొనాల్సి వచ్చిందని పలువురు మహిళలు పేర్కొన్నారు. లక్ష్మీదేవి రూపులు బరువును బట్టి రూ.1800 నుంచి రూ.10070 వరకూ విక్రయించారు. తుని పట్టణవాసులలే కాకుండా పరిసర ప్రాంత గ్రామాలను నుంచి కొనుగోలుదారులు రావడంతో మెయిన్‌రోడ్డు, ఫీడర్‌రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, మార్కెట్‌యార్డు రోడ్లు, పెద్దవీధి, నక్కన వీధులలో రద్దీ నెలకొంది.

ఉలిగోగుల అభివృద్ధికి కృషి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



ఉలిగోగులలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

ప్రత్తిపాడు రూరల్‌: ఉలిగోగుల గిరిజన ప్రాంత అభివృద్ధి, గిరిజన ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మండలంలోని బురదకోట పంచాయతీ పరిధిలోని ఉలిగోగుల గిరిజన గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గిరిజనులతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉలిగోగులలో నివసిస్తున్న 37 కుటుంబాలతో ప్రాథమిక పాఠశాల వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఉలిగోగుల గిరిజన ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, హౌసింగ్, విద్యుత్తు వంటి ఇతర అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. హౌసింగ్ సంబంధించి గ్రామకంఠం లేని కారణంగా ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం లేదన్నారు. ఉపాధి హామీ బిల్లుల బకాయిలు, విద్యుత్ లైన్లు, స్తంభాల మరమ్మతులు తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. ఉలిగోగులకు రోడ్డు మంజూరైందని, వర్షాలు తగ్గాక పనులు ప్రారంభిస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను మూడు వారాల్లోపు పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం, ఎంఈఓలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, వైద్యాధికారి కె.యశస్వి, ఏపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంలో చంద్రబాబు విఫలం

- వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం



వేమవరంలో ప్రజలకు చంద్రబాబు మోసాలపై కరపత్రాలు అందజేస్తున్న యనమల కృష్ణుడు

తొండంగి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పేదలకు సంక్షేమాన్ని అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. మండలంలోని వేమవరం, అద్దరిపేట గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తు చేస్తూ చంద్రబాబు పాలనలో జరిగిన మోసాన్ని ప్రజలకు వివరించారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వెస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్, పార్టీ మండల యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, వేమవరం సర్పంచ్ మారేటి కృష్ణ, అద్దరిపేట సర్పంచ్ కోడా వర్మ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యనమల పంపా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్‌: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఉత్తరకంచి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, బొడ్డు చిన్నా, కందా మాణిక్యం, రామిశెట్టి త్రిమూర్తులు, బొరుసు ప్రకాశం, అనుబోలు ఆదినారాయణ, నెల్లిపూడి దొంగయ్య, రామిశెట్టి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి నిరసన



ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ గూండాలు చేసిన దాడికి వ్యతిరేకంగా పట్టణంలో గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన తెలిపారు. పార్టీ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి తప్పదని టీడీపీ గూండాలు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే అజెండా పెట్టుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు దాడులకు తెగపడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, పైల విజయ్‌కుమార్, డేగల చంద్రమౌళి, కొత్తపల్లి రవి, రెడ్డి బాబులు, జామి శ్రీను, గంపా తేజ, తదితరులు పాల్గొన్నారు.

20 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో నూతనంగా 20 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉన్న 227 పోలింగ్ కేంద్రాల సంఖ్య 247కి పెరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకూ నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 1,150 కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న 20 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. నియోజకవర్గంలో 21 పోలింగ్ కేంద్రాల లోకేషన్‌ను మార్పు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై రాజకీయ నాయకులు సూచనలు ఇవ్వాలని కోరారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం. సత్యనారాయణ, తహసీల్దార్లు ఎం.సూర్యప్రభ, ఆనందకుమార్, తాతారావు, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు చేనేత రంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉండాలన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను విద్యార్థులు వాడాలన్నారు. ఎన్‌సీసీ పీఓ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని ధర్మవరంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చేనేత సొసైటీ కార్యాలయం వద్ద చేనేత జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ధర్మవరం చేనేత సొసైటీ అధ్యక్షుడు ఉద్దండం రవి, ఇందన ఏసుబాబు పాల్గొన్నారు.

కుండపోతతో ఉపశమనం



బెండపూడి జాతీయరహదారిపై కురుస్తున్న వర్షం

తొండంగి: గత కొద్ది రోజులుగా సూర్యతాపానికి విలవిల్లాడిన ప్రజలు గురువారం కురిసిన కుండపోత వర్షంతో ఉపశమనం పొందారు. ఈ ఏడాది వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాలకు లేక నారుమడులు వేసిన రైతాంగంతో పాటు ఉష్ణతాపానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. గురువారం కుండపోత వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు చల్లదనానికి సేదతీరారు. కాగా వరిరైతుల్లో ఆశలు చిగురించాయి.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు: రోజంతా ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు వర్షం ఒకింత ఊరటనిచ్చింది. గురువారం ఉదయం నుంచి సూర్యభగవానుడు ఉగ్ర రూపం చూపాడు. కాగా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ప్రత్తిపాడు, లంపకలోవ, మెట్టుచింత, గోకవరం, ఉలిగోగుల తదితర గ్రామాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ప్రత్తిపాడు – లంపకలోవ రహదారిపై వర్షం నీరు చేరింది.

రైల్వే గేటును ఢీకొట్టిన స్కూటీ



గోపాలపట్నంలో స్కూటీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న రైల్వేగేటు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం–తొండంగి ప్రధాన రహదారిలో రైల్వేగేటును గురువారం స్కూటీపై వెళుతున్న వృద్ధ దంపతులు అదుపు తప్పి ఢీకొట్టారు. దీంతో సుమారు మూడున్నర గంటలపాటు గేటు మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. సామర్లకోట రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్నాహ్నం ఒంటి గంటన్నర సమయంలో రైలు వస్తున్న కారణంగా గేటు వేశారు. తొండంగి వైపు నుంచి ఆస్పత్రికి వెళ్లేందుకు వృద్ధ దంపతులు స్కూటీపై వస్తుండగా గేటు దగ్గరకు వచ్చే సరికి గేటు పడిపోవడంతో స్కూటీ అదుపుతప్పి గేటును ఢీకొట్టింది. కింద పడిపోగా స్వల్పగాయాలయ్యాయి. స్కూటీని వదిలి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా గేటు లాక్ అవ్వడంతో సాయంత్రం ఆరుగంటల వరకూ గేటు వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఈ రహదారి మీదుగా వెళ్లే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దగ్గరలో ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో పి.ఇ చిన్నాయపాలెం గేటు ద్వారా రాకపోకలు సాగించారు. కాగా రైల్వే అధికారులు గేటుకు మరమ్మతులు చేపట్టి సరిచేయడంతో సాయంత్రం నుంచి రాకపోకలు యథావిధిగా సాగాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ



అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిని అభయహస్తంగా చూపుతూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు, చండీ పారాయణలు, సాయంత్రం లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు ఛామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అలాగే స్థానిక బ్రాహ్మణ సంఘం సభ్యులు కూడా సారె సమర్పించారు.

రీ సర్వేపై అభ్యంతరాలుంటే తెలపాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణనాయక్

గోకవరం: మల్లవరం గ్రామ ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తయినందున రీ సర్వేపై అభ్యంతరాలుంటే రెవెన్యూ అధికారులకు తెలపాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని మల్లవరం గ్రామంలో గురువారం రీ సర్వే ప్రాజెక్టు ఫేజ్1కి సంబంధించి ఆర్ఓఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో భూములపై ఎవరికైనా అభ్యంతరాలుంటే స్థానిక రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మొత్తం 3391 ఎల్‌పీఎం, డీఎల్ఆర్‌లు పబ్లికేషన్ చేసి ప్రతి గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాగర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించాలని వినతి



ప్రత్తిపాడులో తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీను

ప్రత్తిపాడు: గ్రామంలోని శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించి, వసతులు కల్పించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబులను కలసి వినతిపత్రాలు అందజేశారు. స్థానిక ప్రగతి కళాశాల వెనుక గల శ్మశాన వాటికను ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు కేటాయించారన్నారు. కాగా శ్మశానవాటికలో కనీసం నిలబడడానికి నీడ లేదని, వర్షం పడితే ఎక్కడికి వెళ్లాలో తెలియని దుస్థితి నెలకొందన్నారు. శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించి, వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోర్నపూడి కోటేశ్వరరావు, ఈరుగుల చక్రం, మూరా నాగేంద్ర, మువ్వల అప్పన్న, సలాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని గజ్జనపూడి శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు గురువారం శ్రీకారం చుట్టారు. శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో భాగంగా బోరు కొట్టి మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించి వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లి వీరబాబు, బర్ల నాగరాజు, గొనగాల దేవుళ్లు, కొండేపూడి అబ్బాయి, మోరుకుర్తి సుబ్బారావు, బుర్ర నాగేశ్వరరావు, పల్లి సత్తిబాబు, పెనుపోతుల సత్తిబాబు, వంగలపూడి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ఘనంగా నిర్వహించాలి

ఏలేశ్వరం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటింటా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని సిరిపురంలో గురువారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఇటీవల నియమితులైన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రమణ, ప్రధాన కార్యదర్శులు కర్రి బాబీ, గెద్దం సత్తిబాబు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఏడిద రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోట నూకరాజు, సోషల్ మీడియా ప్రతినిధి కొల్లూరి సుబ్బారావులకు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన



తొండంగిలో శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న బాలామణి

తొండంగి: మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పెద్దాపురం డీఎల్పీఓ బాలామణి గురువారం పరిశీలించారు. ఎ.కొత్తపల్లి, తొండంగిలో చెత్త సేకరణ కేంద్రాలను సందర్శించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ, నిర్వహణపై పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

శంఖవరం: ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆయిల్ పామ్ విస్తరణ మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులకు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి దివ్యశ్రీ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జీఎం పట్టాభి, ఏజీఎం రవీంద్ర, మేనేజర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక బంధువుల చెంతకు..

గండేపల్లి: అదృశ్యమైన బాలికను తీసుకువచ్చి ఆమె బంధువులకు అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని తాళ్లూరుకు చెందిన బాలిక ఈ నెల 1న అదృశ్యం కాగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై యువి శివ నాగబాబు తన సిబ్బందితో విచారణ చేపట్టారు. బాలిక హైదరాబాద్ బోయెనుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఉన్నట్టుగా గుర్తించారు. ఆమెను తీసుకువచ్చి బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేషనల్ డీ వార్మింగ్ డే పోస్టర్‌ను ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఆల్బెండజోల్ మాత్రలను ఏఎన్ఎంలకు అందజేశారు. ఈ నెల 12న ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలనిస సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్, ఎంఈఓ కేహెచ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలో ధర్మవరం గ్రామానికి చెందిన మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ తల్లి జగ్గయ్యమ్మ అనారోగ్యంతో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా ఆమెను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెంచుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.లల్లీ సూచించారు. ప్రత్తిపాడు ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో గురువారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. నూతనంగా వసతిగృహంలో చేరిన విద్యార్థినులకు స్వాగతం పలికారు. వసతి గృహంలో రూ.10 లక్షలతో మరమ్మతులు పూర్తి కాగా, ప్రస్తుతం వెయిటింగ్ హాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయని పెద్దాపురం డివిజన్ బీసీ సంక్షేమ సహాయ అధికారి సూరిబాబు తెలిపారు. ఏడు అదనపు టాయిలెట్స్ నిర్మాణానికి రూ.21 లక్షలు మంజూరయ్యాని చెప్పారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి చాముండేశ్వరి, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

గండేపల్లి: పంట నమోదు ప్రక్రియను రైతులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఏడీఏ శ్రీనివాస్ సూచించారు. గండేపల్లిలో పంట నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు సత్తిబాబు, బి.రామకృష్ణ, వీఏఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్ఫూర్తి ప్రదాత దూబగుంట రోశమ్మ

తుని రూరల్‌: మద్యపాన వ్యతిరేక ఉద్యమకారిణి దూబగుంట రోశమ్మ రాష్ట్రంలో లక్షలాది మంది మహిళలకు స్ఫూర్తిదాయకమని మద్యపాన వ్యతిరేక కమిటీ జిల్లా సభ్యుడు, విశ్రాంతి ఉపాధ్యాయుడు కొడుకుల నాగభూషణరావు అన్నారు. వీరవరపేట గాంధీనగర్ పార్కు వీధిలో గురువారం దూబగుంట రోశమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోశమ్మ ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమను కొనియాడారు. మద్యపానం వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో తాటిపాక కామేలు, వాతాడ అప్పలకొండ, తుమ్మలపల్లి దుర్గ, గంటిపల్లి బాపనమ్మ, శివకోటి రాఘవమ్మ, బర్రే సత్యవతి, వేమగిరి లోవతల్లి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ధర్మవరం గ్రామానికి చెందిన సింగులూరి దేవుడు (58) మద్యానికి బానిసయ్యాడు. అతనితో కుటుంబ సభ్యులు మద్యం మాన్పించారు. దీంతో మానసిక వేదన చెంది బుధవారం సాయంత్రం తన ఇంటిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు మోటారు సైకిల్‌పై ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితులకు న్యాయం చేయాలి

తుని రూరల్‌: దళితులపై దాడులు చేస్తున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ గురువారం డిమాండ్ చేశారు. కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెంలో దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితులు కోర్టు ద్వారా హక్కులు పొందినా ఇటీవల వారు వేసిన నారుమడులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారన్నారు. దీనిపై కోటనందూరు ఎస్సైకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావుకు ఫిర్యాదు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హక్కుదారులతో కలసి ర్యాలీగా సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితులకు న్యాయం చేయాలని కోరారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



సీహెచ్‌సీ నూతన భవనంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. జగ్గంపేటలోని సీహెచ్‌సీని ఇటీవల జెడ్.రాగంపేటలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్పు చేశారు. కాగా గురువారం ఎమ్మెల్యే జెడ్.రాగంపేటలో ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై సూపరింటిండెంట్ ప్రణీత్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో ఆధునిక పరికరాలతో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు జీను మణిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్‌: శాంతిఆశ్రమం పరిధిలోని 11 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని శాంతిఆశ్రమంలో రూ.3 కోట్లతో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో ఓల్టేజ్, హై ఓల్టేజ్, పవర్ కట్ వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జగ్గంపేట ఈఈ వీరభద్రరావు, ఎలక్ట్రికల్ ఏడీఈ రాజశేఖర్, ఏఈ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్‌: మండలంలోని ధర్మవరంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. గ్రామంలో రూ.11 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ ఉద్యానవనం, రూ.1.28 కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కూటమి నాయకులు దాసం శేషారావు, కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్ పాల్గొన్నారు.